# సాక్షి గుంటూరు

శనివారం । 22 । జూన్ । 2024






## రామయ్యకు పుష్పయాగం

పిట్టలవానిపాలెం : స్థానిక సీతారామ స్వామికి జ్యేష్టాభిషేక పుష్పయాగం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. 108 కలశాలతో సుగంధ ద్రవ్యాలు, నదీ జలాలతో అభిషేకం గావించారు.



## కాజలో కోలాహలంగా ఏరువాక

మంగళగిరి: కాజా గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఏరువాక నిర్వహించారు. రైతులు పెద్ద సంఖ్యలో వినాయకుని ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ధనలక్ష్మిగా దర్శనం



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

## న్యూస్‌రీల్

### బ్రిడ్జిపై మరమ్మతులు చేయండి



తెనాలిఅర్బన్: ఓవర్ బ్రిడ్జిపై ఉన్న ఫుట్‌పాత్ మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఓవర్ బ్రిడ్జిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఫుట్‌పాత్ దెబ్బతిని ఉండటాన్ని గమనించిన ఆయన తగిన ఆదేశాలు ఇచ్చారు. అనంతరం 31వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

### వృద్ధురాలి ఔదార్యం

**నేత్రాలు దానం**



మంగళగిరి: మంగళగిరి పట్టణానికి చెందిన పట్టెం వెంకటరత్నం (85) తన నేత్రాలను దానం చేసింది. అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. వృద్ధురాలు ముందుగానే శంకర కంటి ఆసుపత్రికి నేత్రాలను దానం చేస్తామని సమాచారం ఇవ్వడంతో వైద్యులు వచ్చి వాటిని సేకరించారు. వృద్ధురాలి ఔదార్యాన్ని పట్టణంలోని పలువురు కొనియాడారు.

### యార్డులో 48,825 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,236 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 48,825 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.18,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,500 నుంచి రూ.20,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,490 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### దుర్గమ్మకు మలేషియా కళాబృందం నృత్యనీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు మలేషియాకు చెందిన నందిగేశ్వర్ డ్యాన్స్ అకాడమీ కళాబృందం శుక్రవారం నృత్య నీరాజనాలను అర్పించారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై చంద్రమోహన్ రామస్వామికి చెందిన పలువురు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మవారి దర్శనం అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళాబృందానికి చెందిన వారికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

# ప్రైవేటులో పుస్తక వ్యాపారం



గోదాములో పాఠ్య పుస్తకాలు

- ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కొనుగోలుకు ఎగనామం
- ఆన్‌లైన్‌లో ఆర్డర్ విధానంతో పక్కాగా పుస్తక విక్రయాలకు ఏర్పాట్లు
- ప్రైవేటు పబ్లిషర్ల పుస్తకాలను కొనుగోలు చేయిస్తూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలు
- నామమాత్రపు ధరకే విక్రయిస్తున్న ప్రభుత్వ పాఠ్య పుస్తకాలపై నిర్లక్ష్య ధోరణి
- గుంటూరు జిల్లా వ్యాప్తంగా 637 ప్రైవేటు పాఠశాలలు
- ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చిన పాఠశాలలు 10 శాతం లోపే
- ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందేనంటున్న విద్యాశాఖాధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని పట్టాభిపురానికి చెందిన అశోక్ ఓ ప్రైవేటు కంపెనీలో గుమస్తాగా ఉద్యోగం చేస్తున్నాడు. తన ఇద్దరు పిల్లలను దగ్గర్లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాడు. ఒకటో తరగతిలో చేర్పించిన బాబుకు రూ.15వే ఫీజుతోపాటు పుస్తకాల కోసం అదనంగా రూ.మూడు వేలు చెల్లించాలని స్కూల్లో చెప్పారు. రెండో తరగతిలో చేర్పించిన అమ్మాయికి ఫీజు రూపంలో రూ.18వేలతోపాటు పుస్తకాల కోసం రూ.3,500 చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల వెల ఒక్కో విద్యార్థికి రూ.500లోపే కదా అని అశోక్ అడిగితే ప్రభుత్వ పుస్తకాలతో తమకు సంబంధం లేదని, స్కూల్లో తామిచ్చే పుస్తకాలనే కొనుగోలు చేయాలని పాఠశాల యాజమాన్యం సెలవిచ్చింది. ప్రస్తుతం గుంటూరు నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతున్న సంఘటనకు ఇదో ఉదాహరణ.

**ధనార్జనే ధ్యేయంగా పుస్తక విక్రయాలు**

జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పబ్లిషర్లు ముద్రించిన పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్నాయి. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణా సంస్థ (ఎస్సీఈఆర్టీ) రూపొందించిన పాఠ్యాంశాల బోధనకు బదులుగా ఆయా పాఠశాలల యాజమాన్యాలు అనధికార పాఠ్య పుస్తకాలతో తరగతులు నిర్వహిస్తున్నాయి. గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ ద్వారా రూపొందించి, ముద్రించిన పాఠ్య పుస్తకాలనే బోధించాలని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నప్పటికీ, వాటిని గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందుగానే జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విక్రయ పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం సకాలంలో సిద్ధం చేసినప్పటికీ, వాటిని కొనుగోలు చేయకుండా వివిధ పాఠశాలల యాజమాన్యాలు ప్రైవేటు పబ్లిషర్ల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టాలని ఒక వైపు విద్యాశాఖాధికారులు చెబుతున్నప్పటికీ ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు.

**ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కొనుగోలు చేయాల్సిందే..**



ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలను ఖచ్చితంగా కొనుగోలు చేయాలి. తరగతుల వారీగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలో ఐదు శాతాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించి, మిగిలిన మొత్తాన్ని సంబంధిత విక్రయదారులకు చెల్లించి పుస్తకాలను పొందాలి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠ్య పుస్తకాలకు ఇండెంట్ పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పి.శైలజ, డీఈవో, గుంటూరు

**ప్రభుత్వ పాఠ్యాంశాలు తప్పనిసరి**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోధన చేస్తున్న పాఠ్యాంశాలనే ప్రైవేటు పాఠశాలల్లోనూ తప్పనిసరి చేస్తూ గత ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయానికి అనుగుణంగా ప్రతియేటా విద్యాశాఖాధికారులు ప్రైవేటు పాఠశాలలు పుస్తకాలు కొనుగోలు చేసేలా పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని సగానికి పైగా ప్రైవేటు పాఠశాలలు పుస్తకాలకు ఇండెంట్ పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఎస్సీఈఆర్టీ అకడమిక్ కేలండర్‌కు విరుద్ధంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు సొంత సిలబస్ బోధించి, పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యాజమాన్యాలు ఒకటో తరగతికే రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు వ్యయం చేయిస్తూ తల్లిదండ్రులతో ప్రైవేటు ముద్రణ సంస్థల పుస్తకాలను కొనుగోలు చేయిస్తున్నారు.

**హెచ్‌ఎం లాగిన్ ద్వారా విక్రయాలు**

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను హెచ్‌ఎం లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి, కొనుగోలు చేసే విధంగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం దీనిపై విద్యాశాఖాధికారుల ద్వారా పాఠశాలల యాజమాన్యాలకు సమాచారాన్ని చేరవేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 637 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 10 శాతం ఇండెంట్ నమోదు చేసుకున్నట్లు చెబుతున్నారు.

# దడపుటిస్తున్న ధరలు



గుంటూరు పట్టాభిపురం రైతుబజారులో కూరగాయలు

- ఠారెత్తిస్తున్న టమాటా
- ఘాటెక్కుతున్న ఉల్లి
- పెరుగుతున్న కూరగాయల ధరలు

కొరిటిపాడు(గుంటూరు): కూరగాయల ధరలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. టమాట, ఉల్లి గడ్డతో సహా అన్ని రకాల ధరలు పెరిగిపోతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారు. ఈ ఏడాది వేసవిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో కూరగాయల సాగుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో మార్కెట్‌లో కొరత ఏర్పడి ధరలు పెరిగాయి. ప్రస్తుతం రైతుబజార్లలో టమాట కిలో ధర రూ.64 ఉండగా బయట మార్కెట్‌లో రూ.70 నుంచి రూ.75కు అమ్ముతున్నారు. వేసవి కాలంలో టమాట సాగుకు జిల్లాలో అనుకూల వాతావరణం లేకపోవడంతో సాగు చేయలేదు. దీంతో మదనపల్లి, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. స్థానికంగా పండించే టమాట మార్కెట్‌లోకి రావడానికి రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా కొద్ది రోజులుగా ఉల్లికి కూడా డిమాండ్ ఏర్పడింది. అత్యధికంగా ఉల్లి పంట ఖరీఫ్‌లో ఇప్పుడిప్పుడే సాగు మొదలవుతోంది. మహారాష్ట్ర నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. హోల్‌సేల్‌గా కిలో ధర రూ.32 నుంచి రూ.35 వరకు ఉంటోంది. రైతుబజార్లలో రూ.36 వరకు విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ.45 నుంచి రూ.50 వరకు అమ్ముతున్నారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. వీటికితోడు కూరగాయల ధరలు కూడా దడపుట్టిస్తున్నాయి.

**గుంటూరు పట్టాభిపురం రైతుబజారులో కూరగాయల ధరలు ఇలా(కిలోకు)..**

| | | | |
|---|---|---|---|
| టమాటా | రూ.64 | దొండ | రూ.34 |
| ఫ్రెంచ్‌బీన్స్ | రూ.156 | బంగాళదుంప | రూ.36 |
| వంకాయ | రూ.44 | ఉల్లిపాయలు | రూ.36 |
| బెండ | రూ.35 | గోరుచిక్కుడు | రూ.49 |
| పచ్చిమిర్చి | రూ.45 | దోస | రూ.26 |
| కాకర | రూ.48 | పొట్ల | రూ.44 |
| బీర | రూ.44 | చామ | రూ.34 |
| క్యాబేజి | రూ.32 | క్యాప్సికం | రూ.90 |
| క్యారెట్ | రూ.44 | -- | |

## కొండెక్కిన .. కొత్తిమీర ధర

సత్తెనపల్లి:కొత్తిమీర కొండెక్కి కూర్చుంది. రూ.10 ఉన్న 200 గ్రాముల కొత్తిమీర కట్ట ధర ఒక్కసారిగా పెరుగుతూ ప్రస్తుతం రూ.45కి చేరింది. దీంతో వ్యాపారులు రవాణా, తరుగు చార్జీలు కలుపుకొని కొంతమేర లాభంతో బహిరంగంగా మార్కెట్లో కొత్తిమీర కట్ట రూ.50 నుంచి 60 వరకు విక్రయిస్తున్నారు. ఈ పంట స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల హోల్‌సేల్ వ్యాపారులు పలమనేరు, కోలార్ నుంచి తిరుపతికి అక్కడ నుంచి ఓల్వా జిల్లాలోని వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. కొత్తిమీర ధర ఈ ఏడాది జనవరిలో 200 గ్రాముల కట్ట రూ.10 నుంచి రూ.15 వరకు ఉంది. అప్పటి నుంచి వేసవికాలం ప్రారంభమయ్యేనాటికి కొత్తిమీర పంట పూర్తిగా తగ్గిపోవడంతో కొరత తీవ్రమైంది. దీనివల్ల హోల్‌సేల్ వ్యాపారులు కొత్తిమీరను తిరుపతి ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పుదీనా, గోంగూర, తోటకూర వంటి ఆకు కూరల ధరలు పెరిగాయి.

# తల్లిదండ్రుల కలలు సాకారం చేసేలా శ్రమించాలి



కళాశాల టాపర్ వెంకట జ్వాలకు బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె మన్మథరావు, పక్కన వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు
- ఘనంగా వీవీఐటీ స్నాతకోత్సవం

పెదకాకాని: ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కలలు సాకారం చేసేలా నిత్యం శ్రమించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె మన్మథరావు అన్నారు. పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల స్నాతకోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె మన్మథరావు, జెఎన్‌టీయూ, కాకినాడ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ నూతన ప్రపంచంలో అడుగుపెడుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తు పరిస్థితులను ఆకలింపు చేసుకొని మంచిని వెతకాలని సూచించారు. ఏ రంగంలో ముందుకు వెళ్లాలన్న వ్యక్తిత్వ వికాసం ముఖ్యమని ఎదుటి వ్యక్తిని గౌరవించాలని అన్నారు. సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, అభిప్రాయాన్ని వ్యక్తపరిచే పరిస్థితులు ఆలోచనల్లో మంచిని చూడాలని అన్నారు. నిత్య విద్యార్థిగా ఉండాలని గమ్యం వైపు ముందుకు సాగాలని తెలిపారు. ఏ వృత్తిలో ఉన్నా బాధ్యతను విస్మరించరాదని సూచించారు. జెఎన్‌టీయూ, కాకినాడ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రసాదరాజు మాట్లాడుతూ జెఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యతో పాటు మానవత్వ విలువలను, మంచి ఆలోచనా విధానాన్ని అలవర్చుకొనే విధంగా విద్యార్థులకు విద్యను అందిస్తుందన్నారు. అనతికాలంలోనే వీవీఐటీ కళాశాల ఉన్నత స్థితిని అందుకుందని కొనియాడారు. డిగ్రీలు పొందిన విద్యార్థులు భవిష్యత్తులో మెరుగైన విజయాలను సాధించి అందరూ గర్వపడే విధంగా ఉండాలని సూచించారు.

వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజానికి సాధ్యమైనంత మంచి చేయాలని సూచించారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ, సవాళ్లను అధిగమిస్తూ ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. 2020-2024 విద్యా సంవత్సరానికిగాను అత్యుత్తమ ప్రతిభ కనబరచి, కళాశాల టాపర్‌గా నిలచిన విద్యార్థిని జీఎస్ఎస్ఎస్ఎల్ వెంకట జ్వాలకు వాసిరెడ్డి వెంకటాద్రి బంగారు పతకాన్ని ముఖ్యఅతిథి హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ కె మన్మథరావు అందజేశారు. వేడుకలలో క్లాస్ ఆఫ్ 2024కు ఉత్తమ ప్రతిభ కనబరచిన 10 మంది విద్యార్థులకు బంగారు పతకం, ప్రశంసాపత్రాలతోపాటు 1116 మంది పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. భారతీయ సంస్కృతిని ప్రతిభంబించేలా విద్యార్థులు సాంస్కృతిక వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి కళాశాల వార్షిక ప్రణాళికను భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రాచీన యోగా ఆధునిక ప్రపంచానికి వరం



ఎన్టీఆర్ స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు

గుంటూరువెస్ట్(క్రీడలు): ఆధునిక ప్రపంచానికి అందించిన మహాద్భుతమే యోగా విద్య అని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడలతోపాటు యోగా విద్యలోనూ సాధన చేయించాలని కోరారు. భారతదేశం ప్రవేశపెట్టిన ప్రతిపాదనలు ఆమోదించిన మీదట ఐక్యరాజ్యసమితి జూన్ 21, 2015 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మన దేశానికి పేటెంట్ లభించిందన్నారు. ఆరోగ్యంతోపాటు నడవడిక, సామాజిక దృక్పథం యోగాతో లభిస్తాయని జేసీ వివరించారు. అనంతరం జేసీతోపాటు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా వైద్య అధికారి డాక్టర్ విజయలక్ష్మి, జీఎంసీ అడిషనల్ కమిషనర్ రాజేశ్వరి, ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి, డిప్యూటీ మేయర్ షేక్ సజీల యోగా సాధన చేశారు. యోగా గురువు సాంబశివరావు అధికారులు, విద్యార్థులతో యోగా సాధన చేయించారు. సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, వ్యవసాయ శాఖ జేడీ నున్నా వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు.

**జిల్లా కోర్టు ఆవరణలో...**

నగరంపాలెం: యోగా ఆరోగ్యానికి మంచిదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రపంచ యోగా దినోత్సవం శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ యోగా మానసిక ఒత్తిడిని తొలగిస్తుందని పేర్కొన్నారు. యోగా విశిష్టతను వివరించారు. అనంతరం యోగసనాలు చేయించారు. యోగా గురువులను సత్కరించారు. న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యు లు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ఆవరణలో యోగాసనాలు చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

**డీఆర్ఎం కార్యాలయంలో...**

లక్ష్మీపురం: ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కోసం నిత్యం యోగా సాధన చేయాలని గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ముందుగా జ్యోతి వెలిగించి యోగా కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఆర్ఎం మాట్లాడుతూ యోగా అనేది ప్రపంచానికి దేశం ఇచ్చిన బహుమతి అని అన్నారు. ప్రఖ్యాత యోగా టీచర్ నందిత మాట్లాడుతూ ఒత్తిడి లేని జీవితాన్ని గడపడానికి ప్రతి రోజూ యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఒత్తిడితో కూడిన వాతావరణంలో పనిచేసే ఉద్యోగులకు యోగా చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. అనంతరం ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సంకల్పం, వంటి వాటితో సెషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ఎం సతీమణి, రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు ఆశాలత, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, రైల్వే డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ కె.సత్య హరప్రసాద్, డీఈఎన్ భారత్, సిబ్బంది, డివిజన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి

**జిల్లా కారాగారంలో...**

నగరంపాలెం: ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ అధ్యాపకులు తన్నీరు వినయ్, పర్వి ప్రసాద్ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా కారాగారంలో నిర్వహించారు. ఖైదీలతో యోగాసనాలు వేయించారు. యోగా విశిష్టతను తెలియజేశారు. ఆసనాలు వేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని అధ్యాపకులు తన్నీరు వినయ్, పర్వి ప్రసాద్ తెలిపారు. జైలు సూపరింటెండెంట్ కె.రఘు పాల్గొన్నా రు.



యోగా చేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ, అధికారులు



నీటిలో ఆసనాలు వేస్తున్న అభ్యాసకుడు



యోగాసనాలు వేస్తున్న ఖైదీలు

# పరిశుభ్రమైన నీటిని అందించాలి

**జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి**

గుంటూరువెస్ట్:గ్రామ, పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సురక్షిత నీటిని అందించేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి పైపుల లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని అవసరమైన వాటిని మార్చాలని సూచించారు. తాగునీటిని సరఫరా చేసే ట్యాంకర్లను షెడ్యూల్ ప్రకారం శుభ్రపరచాలని చెప్పారు. సరఫరా చేసే నీటికి అన్ని పరీక్షలు నిర్వహించాలన్నారు. టైల్ ఎండ్ పాయింట్లు, తాగునీటి పైపుల వద్ద నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలు సురక్షితంగా రాకపోతే తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, డీపీఓ శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, జీఎంసీ అదనపు కమిషనర్ లక్ష్మీరాజ్యం, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

**కూరగాయల ధరలు నియంత్రించాలి: కలెక్టర్**

కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జేసీ రాజకుమారితో కలిసి నిర్వహించిన జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. వాస్తవానికి అధిక ఉష్ణోగ్రతల కారణంగా కూరగాయల దిగుబడి తక్కువగా ఉందన్నారు. చిత్తూరు హోల్‌సేల్ మార్కెట్‌లో టమాటా ధర రూ.60 నుంచి రూ.80 వరకు ఉందన్నారు. మార్కెటింగ్ శాఖ వాటిని కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా కొన్న ధరకే ప్రజలకు విక్రయించాలన్నారు. అవసరమైతే రివాల్వింగ్ ఫండ్‌ను వాడుకోవాలని చెప్పారు. టమాటా ధరలు సాధారణ స్థితికి వచ్చే వరకు ఇదే విధానం కొనసాగించాలన్నారు. నిత్యావసర సరుకులు బ్లాక్ చేయకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు.

## క్లుప్తంగా

### రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుండి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. తెనాలి జీఆర్పీ పోలీసుల అందించిన వివరాలు.. బాపట్ల జిల్లా చుండూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. సుమారు 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెంది పడి ఉండడాన్ని గుర్తించారు. రైలులో నుండి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి జేబులో గురువారం రాత్రి 11 గంటలకు విజయవాడ నుంచి తిరుపతికి తీసుకున్న టికెట్ ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

బండారుపల్లి(తాడికొండ): రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు నడికుడి జీఆర్పీ ఎస్‌ఐ వి.శ్రీనివాసరావు నాయక్ శుక్రవారం తెలిపారు. ఉదయం సుమారు 36 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి శవాన్ని గుర్తించి సత్తెనపల్లి జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. మృతుడి కుడిచేతి మీద బి.కుమారి అని పచ్చబొట్టు తెలుగులో ఉందని, ఎత్తు సుమారు నాలుగున్నర, నలుపు రంగు, తెల్లటి దుస్తులు ధరించి ఉన్నాడు. తలపై దెబ్బ తగలడంతో మరణించినట్లు గుర్తించి సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నడికుడి జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు నాయక్ ఫోన్ నంబర్ 8074174484ను సంప్రదించాలని సూచించారు.

### పట్టపగలు చోరీకి యత్నం

**దుండగుడిని పట్టుకుని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు**



తెనాలిరూరల్: పట్టపగలు ఇంట్లో చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకున్న గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు గ్రామంలో ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని ఓ ఇంట్లోని మహిళ పక్కనే ఉన్న తన అత్తింటికి ఉదయం 10 గంటల ప్రాంతంలో వెళ్లింది. వెంటనే ఐదు నిమిషాల్లో ఇంటికి తిరిగి రాగా ఇంట్లోకి దుండగుడు చొరబడి బీరువాను తెరిచేందుకు ప్రయత్నిస్తుండడాన్ని గమనించింది. ఇంటికి ఉన్న రెండు గుమ్మాలను బయట నుంచి చాకచక్యంగా గొళ్లెం పెట్టేసి సమాచారాన్ని బంధువులకు గ్రామస్తులకు తెలిపింది. గ్రామస్తులు ఇంటికి చేరుకుని దుండగుడిని పట్టుకుని తాళ్లతో బంధించి దేహశుద్ధి చేశారు. అతని జేబులో ఉన్న డ్రైవింగ్‌లైసెన్సు ఆధారంగా బాపట్ల సమీపంలోని అరవపల్లికి చెందిన షేక్ కరిముల్లాగా గుర్తించి పోలీసులకు అప్పగించారు. దుండగుడిపై బాపట్లలో 15కు పైగా చోరీ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి చుండూరు పోలీసుల అదుపులో ఉన్నాడు.

# యోగాతోనే ఆరోగ్యకర జీవితం

- భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ దుర్గారావు
- విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా యోగా దినోత్సవం



వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మాట్లాడుతున్న డి.దుర్గా రావు

చేబ్రోలు: ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎంతో సహాయపడుతుందని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఏపీ వైస్ ప్రెసిడెంట్ డి.దుర్గారావు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో యోగా ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనే ఇతివృత్తంతో నిర్వహించారు. యోగా డేను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీలోని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ డి.దుర్గా రావు మాట్లాడుతూ ప్రస్తుతం మానసిక ఒత్తిడి, సమస్యలు లేని జీవితం లేదంటే అతిశయోక్తి కాదన్నారు. పని ఒత్తిడి, ఆర్థిక పరమైన సమస్యలు, ఇతర ఇబ్బందుల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజు కనీసం ఒక అరగంట అయినా శారీరక శ్రమ చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అందుకు యోగా చక్కని మార్గమని వివరించారు. ఏపీ హైకోర్టు అడ్వకేట్ జీవీఆర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ యోగా అనేది ఒక శక్తివంతమైన మైండ్‌ఫుల్‌నెస్ సాధనమన్నారు. యోగా ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా ఉండేటట్లు చేస్తుందని వివరించారు. యోగా చేయడం వల్ల రక్తపోటు అదుపులోకి వస్తుందన్నారు. యోగ శ్వాసక్రియ శక్తిని కూడా మెరుగుపరుస్తుందని చెప్పారు. పారిశ్రామికవేత్త వీఆర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వలన బరువు తగ్గడం, ఒత్తిడిని తగ్గించుకోవడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులందరూ అష్టాంగ యోగాను త్రికరణ శుద్ధిగా సాధన చేస్తే మంచి రాజయోగంతో జీవిస్తారని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడలోని యోగాసన స్పోర్ట్స్ స్టేట్ సెక్రటరీ పి.ప్రేమ్ కుమార్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

**ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలి**



ఉన్నవ దంపతుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామిశెట్టి శ్రీనివాస్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో చదువుతో పాటు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ లెజిస్లేటివ్ కౌన్సిల్ సంయుక్త కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీశారదానికేతనం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించిన రామిశెట్టి శ్రీనివాస్ సంస్థ వ్యవస్థాపకులైన ఉన్నవ దంపతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మట్లాడుతూ సమాజంలో విద్యావ్యాప్తికి వందేళ్ల క్రితమే ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు చేసిన కృషిని కొనియాడారు. విద్యార్థినులు కష్టపడి చదువుకుని ఉన్నత విద్యావంతులు కావాలని, యోగా సాధన అలవర్చుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాజర్షి ఉచిత యోగా శిక్షణ అకాడమీ యోగా శిక్షకురాలు ఎ.విజయలక్ష్మి, వై.శివపార్వతి, మల్లేశ్వరి శ్రీరామచంద్ర మిషన్ ధ్యాన శిక్షకురాలు శైలజ, సంస్థ కార్యనిర్వహణాధికారి గుర్రం శ్రీనివాస్, ఓరియెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోటిరత్నం, హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.ఉషాకుమారి పాల్గొన్నారు.

### ఎన్జీ రంగా వర్సిటీలో..



యోగాసనాల్లో పాల్గొన్న విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని లాంఫాంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మాట్లాడుతూ యోగా విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ ఆధునిక జీవన శైలిలో యోగాను ఒక భాగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు.

## మలేరియా రహిత దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: మన దేశంలో 2030 నాటికి మలేరియా పూర్తిగా నిర్మూలన లక్ష్యంతో పనిచేస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీ కృష్ణ సుబ్బరాయణం సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో బీసీ కాలనీలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మలేరియా కేసులు లేకుండా చూడాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. వారానికి ఒక సారి ఇంటి పరిసరాలకు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా వ్యాధి ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు వలన ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మంచినీటిలో దోమ గుడ్లు పెట్టి సంతతిని వృద్ధి చేసుకుటుందని వివరించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. దోమ తెరలు వాడటం, పూర్తి వస్త్రధారణతో ఉండటం వంటివి చేయాలని పేర్కొన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి బీబీజాన్ మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలకు వెళ్లి చూయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ పోలు రాజు నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ రాధిక, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, తెనాలి పట్టణ, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, సిబ్బంది జి.రవికుమార్, బండారు మల్లేశ్వరరావు, డి.మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, శివరామప్రసాద్ పాల్గొన్నారు.

### ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని వినతి

నరసరావుపేట: తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లాకు చెందిన ఆక్సిల్లరీ నర్స్ అండ్ మిడ్‌వైఫ్(ఏఎన్‌ఎం)లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవికి విన్నవించారు. శుక్రవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తమకు నిర్దిష్టమైన జాబ్‌చార్టు ఇవ్వాలని, గ్రేడ్–3 నుంచి ఎంపీహెచ్ఏ(ఎఫ్)గా అందరికీ ప్రమోషన్ కల్పించి మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌కు పంపాలని, క్షేత్రస్థాయిలో పని వివరం తెలియజేయకుండా తమను దూషించే యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ డాక్టర్లను నియంత్రించాలని, అనారోగ్యం పాలు చేస్తున్న మొబైల్ యాప్స్ వినియోగాన్ని విరమించాలని, ఇవ్వాల్సిన అలవెన్స్‌లు ఇచ్చి పనిభారం తగ్గించాలని, పబ్లిక్ ఇష్టం లేని బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వాలనే ఒత్తిళ్లు తమపై చేయవద్దని కోరారు.

### లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్: బాపట్ల జిల్లా ఈపురుపాలెంలో యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన యువతిని దారుణంగా చంపివేశారని, కుటుంబ సభ్యులు వెతకగా ఆమె మృతదేహం కనిపించడం విచారకమని, తక్షణమే నిందితులను పట్టుకుని త్వరితగతిన విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని, ఆడబిడ్డలకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

### నిమ్మకాయల ధరలు



తెనాలి: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.5,700, మోడల్ ధర రూ.4800 వరకు పలికింది.

# కేంద్రమంత్రి పెమ్మసానికి ఘన స్వాగతం



అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి చంద్రశేఖర్

ఏఎన్‌యూ: కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి గుంటూరుకు వచ్చిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు వర్సిటీ వద్ద ఘన స్వాగతం లభించింది. గన్నవరం నుంచి గుంటూరు వస్తున్న ఆయనను వర్సిటీ ముఖ ద్వారం వద్ద తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్, తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి బొకేలతో, శాలువాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య సుబ్బారావు, ఆచార్య వి.రవికుమార్, ఆచార్య సింహాచలం, ఆచార్య రామచంద్రన్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్, భవ్య, గోపి, హరీష్, రామన్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు వి.విష్ణు ప్రసాద్, నాయకులు డాక్టర్ ఎం.వెంకటరమణ, కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

**గుంటూరులో..**

గుంటూరు వెస్ట్: గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు జిల్లాలో అపూర్వ స్వాగతం లభించింది. జాతీయ రహదారి వైజంక్షన్ నుంచి భారీ స్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఇన్నర్‌రింగ్‌రోడ్డులో శ్రీకన్వెన్షన్‌లో పెమ్మసాని అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విజయానికి చిత్తశుద్ధితో కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తనకు ఎంపీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కు, సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గల్లా మాధవి, మొహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో పాటు, టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, సయ్యద్ ముజీబ్, భీమనాథం భరత్‌రెడ్డి, మద్దిరాల మ్యాని, కె.రజిని, వనమా నరేంద్ర పాల్గొన్నారు.

# శ్రీరామకథ మృతసంజీవని





హాజరైన మహిళలు ఇన్‌సెట్‌లో చాగంటి

**ప్రవచనకర్త వాచస్పతి 'బ్రహ్మశ్రీ' చాగంటి కోటేశ్వరరావు**

తెనాలి: శ్రీరామకథ మృతసంజీవని... అంత మధురమైనది మరొకటి ఉండదు... రామకథను చదవినా, విన్నా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ప్రవచనకర్త వాచస్పతి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. పట్టణానికి చెందిన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం, సంకీర్తనా సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఇక్కడి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటైన ప్రత్యేక సభలో 'శ్రీరామనాము–శ్రీహనుమాన్ చాలీసా పారాయణ విశిష్టత' అనే అంశంపై ఏర్పాటు చేసిన 'ప్రవచనామృతం' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దాదాపు ఐదు వేలమందికి పైగా హాజరయ్యారు. సభలో బ్రహ్మశ్రీ కోటేశ్వరరావు చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. పాపం మనయందు ఉన్నపుడు, భగదనుగ్రహం లేపుడు ఎలాంటి రక్షణ ఉండదని, మనంతట మనం ఎన్ని ఏర్పాట్లు చేసుకున్నా రక్షణ ఇవ్వలేవని చెప్పారు. రామనామం స్మరిస్తుంటే రామకథను చదివేలా చేస్తుందనీ, రామకథ పాతకాల నుంచి రక్షిస్తుందని అన్నారు. ఈశ్వరుడు ఏమి చేయవద్దని నిర్దేశించాడో వాటిని చేయటమే పాపమని చెబుతూ, కొన్ని ప్రాయశ్చిత్త కర్మలు ఉన్పటికీ పంచ మహాపాతకాలను పోగొట్టే శక్తి భగవంతుని నామ స్మరణకు ఉందన్నారు. 'ఈశ్వరా..స్వర పేటికను ఇచ్చిన మీరే నా చేత భగవంతుడి నామసంకీర్తన చేసే భాగ్యం కల్పించు' అని కోరుకోవాలని సూచించారు. నిర్గుణుడైన భగవంతుడు ఒక్కోసారి ఒక్కో గుణాన్ని ఆవిష్కరించినపుడు సంబంధిత నామం వస్తుందన్నారు. ఏ నామంతో పిలిచినా భగవంతుడు కదిలివస్తాడని చెబుతూ ప్రహ్లాద చరిత, గజేంద్ర మోక్షం అంశాలను గుర్తుచేశారు. అన్నింటిలోకెల్లా రామనామ వైభవం మరింత విశేషమైందని కోటేశ్వరరావు చెప్పారు. రామాయణకాలం నాటికి పరమ గురువైన శ్రీమహావిష్ణువు, శిష్యుడైన వశిష్టుడు దగ్గర శిష్యుడిగా ఉన్నాడని, ఇక్ష్వాకుల వంశానికి మేలుచేస్తూ మనందరికీ శ్రీరామనామం ఇచ్చి మహోపకారం చేశారని వివరించారు. తెలిసిగానీ, తెలియకగానీ రామనమం స్మరిస్తుంటే పాపాన్ని దహించి వేస్తుందన్నారు. రామనామ లేఖనం మహా తపస్సుగా చెప్పారు. శ్రీరామ అని ఎన్ని సార్లు రాస్తే అన్నిసార్లు ఆ నామాన్ని స్మరిస్తామని, విష్ణుసహస్ర నామం ఫలితం లభిస్తుందని వివరించారు. తొలుత శ్రీపంచముఖ ఆంజనేయస్వామికి విశేష అర్చనలు, అనంతరం శ్రీహనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

## మార్కెట్‌లోకి అర్బన్ క్రూజర్ టైసర్ కారు విడుదల



మార్కెట్‌లో కారు విడుదల చేస్తోన్న అతిథులు

నగరంపాలెం: ఆటోనగర్‌లోని లక్ష్మీ టయోటాలో న్యూ టయోటా అర్బన్ క్రూజర్ టైసర్ కారుని డెప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మి, లక్ష్మీ టయోటా జీఎం సందీప్, సర్వీస్ జీఎం పవన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ మార్కెట్‌లోకి కొత్తగా విడుదలైన న్యూ అర్బన్ క్రూజర్ టైసర్ కారు 1000 సీసీ టర్బో పెట్రోల్, 1200 సీసీ పెట్రోల్ ఇంజన్లలో, ఖాతాదారుల అభిరుచి మేరకు సీఎన్జీ మోడల్లో 12 వేరియంట్స్‌ల్లో లభిస్తుందని అన్నారు. కారు ఎక్స్ షోరూం ధర రూ.7.73 లక్షల నుంచి 13 లక్షల వరకు ఉందన్నారు. బుకింగ్స్ ప్రారంభమవ్వగా, మరిన్ని వివరాలకు షోరూంలో సంప్రదించాలని తెలిపారు.

## చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు గద్దె ఉమాశ్రీ**



సమావేశంలో మాట్లాడుతున్న గద్దె ఉమాశ్రీ

సత్తెనపల్లి: మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) పల్నాడు జిల్లా ఉపాధ్యక్షురాలు గద్దె ఉమాశ్రీ డిమాండ్ చేశారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ లైంగిక దాడులకు గురైన మహిళలకు ఎక్స్ గ్రేషియా విడుదల చేయాలని కోరారు. డ్వాక్రా గ్రూపులు పొదుపు అంతర్గత రుణాలుగా తిప్పుకునేవారని, ఇప్పుడు లక్షల రూపాయలు బ్యాంకులలో ఉంటున్నాయని, అవసరాలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కరోనా సమయములో ప్రాణాలు సహితం లెక్క చేయకుండా ఇంటింటికి తిరిగి మందులు, ఆహారం ఇచ్చి ప్రజల ప్రాణాలు కాపాడారని, కాని వారు ఏ ప్రభుత్వం వచ్చినా రాజకీయ వేధింపులకు గురవుతున్నారని ఆవేదనకు వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను రాజకీయ వేధింపుల నుంచి కాపాడాలని కోరారు. జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని మాట్లాడుతూ మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ సచివాలయాల ద్వారా పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా సభ్యులు స్పందన, అనూష, సుజాత, ఐ.పద్మ, సావిత్రి, టి.లక్ష్మి పాల్గొన్నారు.

## విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**వ్యవసాయ శాఖ జిల్లా సహాయ సంచాలకులు రవికుమార్**



తనిఖీలు నిర్వహిస్తున్న రవికుమార్

పిడుగురాళ్ల: విత్తన షాపు యజమానులు అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని వ్యవసాయ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు విత్తనాల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. పిడుగురాళ్ల వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ కృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అనుమతి లేని విత్తనాలను అమ్మరాదని సూచించారు. విత్తనాలు అధిక ధరలకు అమ్మి వారి లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్తగా వచ్చిన విత్తనాల గురించి షాపుల వద్ద స్టాక్ వివరాలను నమోదు చేయాలని కోరారు. షాపు యజమానులు ఎమ్మార్పీ కంటే తక్కువగానే అమ్మాలని షాపు యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## సింథైట్ ఫ్యాక్టరీ కార్మికుల రాస్తారోకో



జాతీయ రహదారిపై బైఠాయించిన కార్మికులు

మేదరమెట్ల: సింథైట్ ఫ్యాక్టరీని మూసివేస్తే ఉద్యమిస్తామని కార్మికులు హెచ్చరించారు. సమీప గ్రామల ప్రజల నుంచి మిరప కారుతో కళ్లు మంటలు వస్తున్నాయని, ఫ్యాక్టరీని మూసివేయాలనే డిమాండ్ పెరిగింది. దీంతో యాజమాన్యం ఫ్యాక్టరీని మూసివేసే అవకాశం ఉందని తెలుసుకున్న కార్మికులు శుక్రవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని కార్మికులకు సర్ది చెప్పడంతో వారు రాస్తారోకోను విరమించారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని తమ్మవరం రోడ్డులో మిరపకాయల నుంచి సింథైట్‌ను తయారు చేసే ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసిన దగ్గర నుంచి సమీప గ్రామాల ప్రజలు తరచూ మిరప కారుతో కళ్లు మండుతున్నాయని, కళ్లు పోయో ప్రమాదం ఉన్నందున ఫ్యాక్టరీని మూసేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మూడు రోజుల క్రితం గ్రామస్తులు, సమీప గ్రామాలకు చెందిన వారు కొందరు ధర్నా చేశారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీని ఎత్తేస్తే తాము ఉపాధిని కోల్పోతామని అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఆందోళనకు దిగారు.

## సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

- హాజరైన జిల్లా కలెక్టర్ బి.లత్కర్
- కలెక్టరేట్ రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్‌లో సీఎన్‌జీ సౌకర్యం ఏర్పాటు



సీఎన్‌జీ ఫిల్లింగ్‌స్టేషన్‌కు ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బి.లత్కర్

నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్‌లో నూతనంగా రూ.1.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్‌ను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జిల్లాలో ఎన్ని సీఎన్‌జీ వాహనాలు ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా సీఎన్‌జీ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సంబంధిత ఆటో డ్రైవర్లకు సూచించారు. తదుపరి ఫిల్లింగ్‌స్టేషన్ పాయింట్‌లో ఏర్పాటు చేసిన ఇంజన్ ఆయిల్ మార్పు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఐటీసీఎల్ ప్రతినిధులు శ్రీరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.